# “మీ హృదయమును కలవరపడనియ్యకుడి” (14:1–31)

జనులందరు ఆదరణ పొందాలి. కొద్ది సంవత్సరాల క్రిందట దీర్ఘకాలంనుండి మిషినెరీలుగా పని చేసిన ఓటిస్ మరియు ఇరెనే గేట్‌వుడ్ అనేవారు కొన్ని రాత్రులు మా యింటిలో గడిపారు. వారితో కూడ ఒక జర్మనీ దేశపు స్త్రీని తోడుకొని వచ్చారు. ఆమెకు ఇంగ్లీషు అంతగా రాదు. ఆమె నిదురించవలసిన పడక గదికి మేము ఆమెను తీసికొని పోయినప్పుడు, చీకటి లేకుండా చేస్తారా అని అడిగింది, తరువాత కిటికీలు కూడా తెరుస్తారా అని అడిగింది. బయట చలిగా ఉన్నందున, అది మాకు వింతగా అనిపించింది. అయినా ఏమి కోరుకుందో దానిని సంతోషంగా చేశాం. ఆమె అలాటి అసాధారణమైన విన్నపాన్ని ఎందుకు చేసిందో మరుసటి ఉదయాన గేట్‌వుడ్ మాకు వివరించాడు. ఆ స్త్రీ నివసించిన ప్రాంతంలో రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ రష్యా సైన్యాలు భయంకరంగా పోరు జరిపారట. ఒక నెలకు పైగా యిరు వర్గాలవారు, పసిబిడ్డను చూచుకుంటూ ఆమె తల దాచుకున్న చీకటి మయమైన నేలమాళిగ ఉన్న స్థలం దగ్గర తుపాకి గుండ్లను పేల్చుతూ ఉండేవారట. అది మహా భయంకరమైన సమయం. ఆమె, ఆమె బిడ్డ ఆకలికి మలమలలాడి దాదాపుగా చచ్చారట. చివరకు యుద్ధం ఆగిపోయింది. ఆమె తన రహస్య స్థలంనుంచి తప్పించుకొని వెళ్లిందట. ఆనాటినుండి, చీకటిలో, అనేక వస్తువులున్న, కిటికీలేని గదిలో ఉండడానికి అసలు యిష్టపడదట! తన బిడ్డను లాలిస్తూ ఎంతో కష్టంగా నెలను గడిపిందట, యిప్పుడు ఆమెకే ఆదరణ కావలసివచ్చింది. మనకందరికి ఆదరణ కావలసిన అవసరం ఉంది.

“మీ హృదయమును కలవరపడనియ్యకుడి” అనే ఆదరణ మాటలతో యోహాను 14లో యేసు తన శిష్యులకిచ్చే సందేశం ఆరంభమౌతుంది (1వ.). 13వ అధ్యాయపు సంఘటనల, ప్రవచనాల అనంతరం, అంటే – అప్పగించడానికి యూదా వెళ్లిపోయిన తరువాత, పేతురు ఆయనను ఎరుగననబోతుండగా, సిలువ త్వరలో సమీపిస్తుందనగా ఈ సందేశము అవసరమయింది. మానవ దృష్టినుండి, ప్రతిదీ “విడిపోబోతుంది.” 14వ అధ్యాయం చివరలో, “మీ హృదయమును కలవరపడనియ్యకుడి” అని అంటూ “వెరవనియ్యకుడి” అనే మాటను కలుపుతాడు (27 వ.). తానును తన శిష్యులు ఎదుర్కొనబోయే బహు కష్టతరమైన గడియలలో “గ్రంథం సూచించే” ఈ రెండు వచనాల మధ్య, ప్రభువు ఆదరణతో కూడిన ఉపదేశం ఉంది. తమ “విశ్వాసపు యాత్రలో” ముందుకు సాగునట్లు ఈ ఉపదేశాలు అపొస్తలులకు సహాయం చేశాయి, నేటి మన ప్రయాణంలోను అవి మనకు సహాయపడగలవు.

"కలవరపడి" అనే పదాన్ని యేసు ఎంతో ఆదరణతో ఉపయోగించాడని మనం ప్రత్యేకంగా గమనించాలి. ఈ సువార్త రచనలో యింకా మూడు పర్యాయములు "కలవరపడి" అనేది ప్రభువైన యేసునే వర్ణిస్తుంది.

> ఆమె [మరియ] ఏడ్చుటయు, ఆమెతో కూడ వచ్చిన యూదులు ఏడ్చుటయు యేసు చూచి కలవరపడి ఆత్మలో మూలుగుచు ... (11:33).
>
> "ఇప్పుడు నా ప్రాణము కలవరపడుచున్నది; నే నేమందును? – తండ్రీ, యీ గడియ తటస్థింపకుండ నన్ను తప్పించుము; అయినను ఇందుకోసరమే నేను ఈ గడియకు వచ్చితిని" (12:27).
>
> యేసు ఈ మాటలు పలికిన తరువాత ఆత్మలో కలవరపడి "–మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని రూఢిగా చెప్పెను" (13:21).

మితిమీరిన దుఃఖ స్థితిలో కలవరపడడం అనేది చాలా సహజంగాను ముందే తెలిసిన ప్రతిక్రియగాను ఉంది. మన జీవితాల్లో విషయాలు విషాదకరమైన దిశకు మళ్లినప్పుడు మనం కలవరపడతాం. కలవరపడవలసిన సమయం ఏదైనా ఉంటే, అది యేసు సిలువవేయబడిన సమయమే. తనయందు విశ్వాసముంచుడని పిలుపునిస్తూ, ప్రభువు తన శిష్యులను ఈ సంఘటనకు సిద్ధపరచుతూ ఉన్నాడు (14:1) మరియు వారి వద్ద మరి కొన్ని ఆధారాలను ఉంచుతున్నాడు.

## మనోగతమైన నివాసం (14:2, 3)

ఈ మాటలు పలికిన తరువాత కొంతసేపటికే, తన శిష్యుల వద్దనుండి ఆయనను లాగుతూ, ఆయనను బంధించడానికి పంపించిన సైనికులు వచ్చారు (8:1–12). ఇది సంభవించినప్పుడు, శిష్యులు ఒంటరివారయ్యారు. దీనివలన వారు మానసికంగా కలవరపడి ఉంటారు. మన శిశుప్రాయంనుండి, ఒంటరివాళ్ళం అవుతామేమోనన్నది చాలా భయం కలిగిస్తుంది. వింతగా, యిలాటి భయాన్ని మనం ఎన్నడూ దాటినట్టు కన్పించదు.

"కుటుంబముపై దృష్టి" అనే తన రేడియో ప్రోగ్రాంలో కన్పించిన ఒక ప్రత్యేకమైన అతిథిని గూర్చి డా. జేమ్స్ డాబ్సన్ చెప్పాడు. ఆమె రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో నాజీల నిర్మూలన శిబిరంలో సంవత్సరాలు గడిపిన ఒక రష్యా యువతి. ఆమె డాబ్సన్ చిత్రంలో లేక ప్రదర్శనలో కన్పించినప్పుడు, సామూహిక హత్యలను, వినాశనాన్ని ఆమె కన్నులారా చూచిందట. యుద్ధానంతరం ఆమె ఎలా అమెరికా దేశానికి వెళ్లి వివాహితు రాలైయ్యిందో ఆమె వివరించింది. విషాదకరంగా, ఆమె భర్త మోసగాడై ఆమెను పరిత్యజించాడు. డాబ్సన్ ఆమెతో మాట్లాడగా, సంవత్సరాల తరబడి జర్మనీ మరణ శిబిరంలో ఉన్నదానికంటె తన వివాహమందు అనుభవించిన తిరస్కారము, విడిచిపెట్ట బడడమనేది మరి ఎక్కువైన బాధాకరంగా ఉందని తెలిపింది!

ఒంటరిగా విడిచిపెట్టబడడం ఎంత వేదనకరమైన పరిస్థితియో ఎరిగి, తను లేకుండా

గడిపే కాలం సమీపిస్తోందని తెలిసి, దాన్ని గురించి ఆలోచించేందుకు తన శిష్యులైనవారికి ప్రభువైన యేసు ఒక నూతన మార్గాన్ని యిచ్చాడు. దానిని విడిచిపెట్టడం అని భావించడానికి బదులు, తన తండ్రి యింటిలో వారికిని స్థలము సిద్ధపరచడానికి వెళ్లుతున్నట్టు ఆయన వారికి తెలియజేశాడు (14:2, 3). భౌతికంగా ఆయన లేని తనాన్ని ఆలోచించడానికి అది ఎంతటి అద్భుతమైన మార్గము!

నేడు, విడిచిపెట్టబడ్డాం మరియు దేవునిచే విసర్జించబడ్డామన్నట్టు నమ్మేలా సమస్యలు వచ్చినప్పుడు సిలువ వద్ద విడిచిపెట్టబడినవారుగా యోచించే శిష్యులకు ప్రభువు ముందుగా ఏమి బోధించాడో దాన్ని మనం జ్ఞాపకం చేసుకోవాలి. ఒకనాడు మనం దేవుని యింట నిరంతరం ఉండేలా ప్రభువు మనకు స్థలం సిద్ధపరచ వెళ్లిన సంగతి గుర్తు చేసికోవాలి!

## స్వీకారానికి ఆదేశం (14:4-11)

తమ కొరకు స్థలం సిద్ధపరచ వెళ్లుతున్నానని ప్రభువు తన శిష్యులకు తెలియజేసిన పిమ్మట తోమా, "–ప్రభువా, యెక్కడికి వెళ్లుచున్నావో మాకు తెలియదే; ఆ మార్గమేలాగు తెలియునని ఆయననడుగగా యేసు – నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు ..." అని బదులిచ్చాడు (14:5, 6). అంతలో మరియొక శిష్యుడైన ఫిలిప్పు, "–ప్రభువా, తండ్రిని మాకు కనబరచుము, మా కంతే చాలునని" అనగా (14:8), తన హృదయపు నిట్టూర్పుతో కావచ్చు, "నన్ను చూచిన వాడు తండ్రిని చూచియున్నాడు ..." అని ఆయన బదులిచ్చాడు (14:9బి). వారు ఎంత తికమకగా ఉన్నా, ఆయనతో వారు సిలువను ఎదుర్కొనునప్పుడు వారి దృష్టినంతను నిలుపవలసినది ఆయనమీదనేనని యేసు నొక్కి చెప్పాడు.

మనము దేవుని సమీపించగోరుతున్నామా? ఆయనకు మనం సన్నిహితంగా ఉండ గోరుతున్నామా? మనం ఆయన వద్దకు ఎలా రాగలం? "తండ్రియొద్దకు వచ్చుటకు" ఆయన ఒక్కడు మాత్రమే మార్గమైయున్నట్టు ప్రభువు తెలియజేశాడు. ఆ మాట ఆయన సిలువవేయబడక ముందటి రాత్రి ఎంత నిజమో, నేడు కూడా అంతే నిజం.

తన పిల్లల పుస్తకాలలోని ఒక దానిలో[1] రాజును గూర్చిన కట్టు కథ ఒకటి పులకరింత కలిగించేలా తెలుపుతాడు. తన కుమార్తెను పెండ్లి చేసికొని తన తరువాత రాజు కాగలవాణ్ణి ఎన్నుకోవడానికి రాజు ఒక పోటీ నిర్వహిస్తాడు. ఆ పోటీలో ముగ్గురు శూరులు పాల్గొంటారు. వారిలో కార్లిస్లే అనేవాడు బలవంతుడు, ఎలోన్ అనేవాడు వేగముగలవాడు, కాసిడన్ అనేవాడు జ్ఞానవంతుడు. వారు చేయవలసిన పని విషపు చెట్లతో కూడిన దట్టమైన అపాయకరమైన హపెనాట్స్ అనబడే తింగరి జనులతోకూడిన అడవిగుండా వెళ్లాలి. ఒప్పందమేమంటే – ఈ అరణ్యాన్ని దాటి అవతల ఉన్న కోటను ఎవడు ముందు చేరుకుంటాడో అతడు రాజు కుమార్తెను పెండ్లి చేసికొంటాడు. కోట గోడల వద్ద రాజు నిలిచి రోజుకు మూడు సార్లు ఆ పోటీదార్లను నడిపించడానికి తన పిల్లనగ్రోవిపై ఒక ప్రత్యేకమైన రాగాన్ని ఆలాపిస్తాడట. ఏదియేలాగున్నా, తన పిల్లనగ్రోవి మీద రాజు ఆ రాగాన్ని ఆలాపిస్తుండగా, ఆ శూరులకు సహాయంగా మార్గం చూపడానికి ఒక్కొక్కనికి

ఒక్కొక్కని తోడుగా యిస్తారట. అయితే ఈ ప్రయాణికులను తప్పు త్రోవ పట్టించడానికి రాజు తన పిల్లనగ్రోవిని ఊదినప్పుడు, హెపెనాట్స్ నకిలీ శబ్దాలు చేస్తూ ఉంటారు.

ఆ ముగ్గురు శూరులు విషపూరితమైన చెట్లుగల ఆ అడవిలో ప్రవేశించి కోటవైపు వెళ్లనారంభించారు. కడకు కాసిడన్, జ్ఞానంగలవాడు ఆ శూరుడు రాజు వద్దకు మొదటిగా చేరగలిగాడట. అతడు అది ఎలా చేయగలిగాడు? అతడు, రాజ కుమారుని, తన ప్రయాణపు జతగానిగా కోరుకున్నాడట. కుమారునికి తండ్రి యొక్క రాగాలాపన బాగా తెలుసు, మరియు అది అతడు కూడా ఆలాపించగలడు. వారు ప్రయాణం చేస్తూ ఉండగా, కాసిడన్ బహు శ్రద్ధగా ఆలకించేవాడు. తాను విన్నదానినంతటిని పోల్చి చూచి, హెపెనాట్స్ యొక్క అనుకరణలకును రాజు యొక్క నిజమైన ఆలాపనకును మధ్య స్పష్టంగా వ్యత్యాసాన్ని గుర్తించగలిగాడట.

తన శిష్యులు తికమకపడతారని, ఆయన వారి వద్దనుండి కొనిపోబడినప్పుడు వారిని వేరు దృష్టికి మరల్చాడు. నిరాశపడతారని ప్రభువైన యేసు ఎరిగినవాడై, వారి శోధన గడియలో సరియైన దిక్కు చూపాడు. వారు ఆయన అడుగుజాడలలో నడుచుకోవాలి. ఎందుకంటె తండ్రి వద్దకు వారిని నడిపించడానికి ఆధారపడదగిన మార్గదర్శి ఆయన ఒక్కడే. నేడు మన కొరకు కూడా ప్రభువు యొక్క సందేశమదే. మన కష్టకాలంలో ఆయనవైపు చూస్తూ ఆయన వెంట వెళ్లడానికి ఆయన పిలుపునిచ్చాడు. ఆయన చెప్పిన సారాంశం "నన్ను వెంబడించు! అనియే. తుఫానుగుండాను, మనం చూడజాలనప్పుడు సైతం, ఏమి గోచరం కానప్పుడు సైతం, – సందేహాలు కలిగినప్పుడు, నీ అంధకార గడియల్లో నన్ను వెంబడించు. తండ్రి వద్దకు చేరుకున్నట్టు నీవు కనుగొంటావ్! అనేది ఆయన భావన."

## అనుభవానికి గల సన్నిధి (14:12-14)

ఒంటరిగా నిదురించడానికి భయపడి మధ్య రాత్రులందు తమ తల్లిదండ్రుల వద్దకు వచ్చే పిల్లలను గూర్చిన కొన్ని నాకు యిష్టమైన కథలున్నాయి. నీ పడకకు వెళ్లి నెమ్మదిగా నిద్రపో ఎందుకంటె దేవుడు నిన్ను చూస్తూ ఉంటాడని తల్లిదండ్రులు ఒక చిన్న పిల్లకు చెప్పారట. ఆ ఆదరణ మాటలతో ఒప్పింపబడక ఆమె యిలా అంది: "అది నిజం కావచ్చు, కాని రాత్రికి నన్ను ఆనుకొని పండుకొనేవారు నాకు కావాలి!" మరొక బిడ్డ తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి తనకు భయంగా ఉన్నట్టు చెప్పాడు. అతని తండ్రి దేవుడు అక్కడే ఆ గదిలో ఉన్నాడు భయపడనవసరం లేదని ఒప్పించ ప్రయత్నించాడు. ఈ బాలుడు కూడా వివరణ కంటె ఎక్కువ కావాలని కోరాడు. అప్పుడు ఆ బిడ్డ యిలా అన్నాడట: "నీవు దేవునితో పండుకొని, నన్ను మమ్మీ వద్ద ఎందుకు పండుకొననియ్య కూడదు?"

ప్రభువైన యేసు, వారికి యిచ్చిన మూడవ మూలాధారం: కలవరపడుతున్న తన శిష్యులను ఆదరించడానికి గాను వారి జీవితాల్లో తన ప్రసన్నత కొనసాగుతునే ఉంటుందని ఆయన తెలిపాడు. తన పేరట వారు ఏమి అడిగినా ఆయన దానిని వారికి చేస్తాననియు,

ఆయన చేయగా వారు చూచినవాటికంటెను గొప్ప కార్యాలు వారు చేస్తారనియు ఆయన వారికి అభయమిచ్చాడు (14:12-14)! భౌతికంగా ఆయన ఉండకపోయినా వారిని ఆదరించడానికిని, సహాయపడడానికిని తనకు అడ్డు లేదని ఆయన అన్నాడు. వారి గాఢాంధకారపు గడియలలో సహితం ఆయన వాగ్దానాన్ని వారు నమ్మవచ్చునని ఆయన తెలిపాడు.

## ఎదురు చూడదగిన సహాయకుడు (14:16-18, 25, 26)

కొంత కాలం ఆయన వారి మధ్యనుండి "వెళ్లిపోతున్న" సంగతిని ఒకటికంటె ఎక్కువ మారులే ఆయన తన శిష్యులకు వివరించాడు.[2] అయినా, ఆయన వెళ్లిపోయినంత మాత్రాన వారిని అనాధలుగా విడిచిపోనని ఆయన వారికి తెలియజేశాడు (14:18). తన స్థానంలో "సహాయకుని" పంపుతానని ఆయన వారికి వాగ్దానం చేశాడు (14:16, 26).[3] "సహాయకుడు" అనేదానికి గ్రీకు పదం యొక్క అర్థం "ప్రక్కన వచ్చియుండువాడు." కోర్టు యొక్క వాతావరణంలో, ఒకని పక్షంగా మాట్లాడే న్యాయవాదిని అది సూచిస్తుంది. తక్కిన పరిస్థితులలో, అవసరతలో సహాయము చేయువాడని అర్థమిస్తుంది. ఇవన్నియు ఆయన వెళ్లిన తరువాత తన అనుచరుల వద్దకు పంపబడే పరిశుద్ధాత్మను సూచిస్తున్నాయి (14:26).

ప్రభువైన యేసువలె పరిశుద్ధాత్మ కూడా దైవికమైన వ్యక్తి. అందువలన ఆయనను "అది" అని అనకూడదు, "ఆయన" అని అనాలి. ఆయన నేడు ప్రభువు సంఘంలోను (1 కొరింథీ. 3:16), వ్యక్తిగతంగా క్రైస్తవులలోను నివసిస్తాడు (1 కొరింథీ. 6:19). మనలను క్రీస్తు యొక్క రూపులోనికి రూపాంతరం చేసే శక్తి ఆయనే (2 కొరింథీ. 3:18) మరియు మనయందు లేక మన జీవితాలలో దైవికమైన ఫలములు ఫలింపజేసేది ఆయనే (గలతీ. 5:22, 23). ప్రభువైన యేసు తన శిష్యులకు చేసిన వాగ్దానాలకు నమ్మకంగా, దేవుని ప్రజల యొక్క జీవితాలలో పరిశుద్ధాత్మ సహాయం చేయడానికిని, ఆదరించడానికిని గొప్ప మూలాధారంగా ఉన్నాడు. ఆత్మ మన వద్దను, మన మధ్యను, మనయందును ఉన్నందున, మనం ఆత్మ సంబంధమైన "అనాధలం" కాము – భూమిమీద ప్రభువు భౌతికంగా యిక ఎన్నడు లేకపోయినా సరే.

లండన్ వీధులలో జి. కె. చెస్టర్‌టన్ మరియు వార్తా విలేఖరి నిలిచియుండగా విలేఖరి చెస్టర్‌టన్‌ను ఒకప్పుడు యిలా అడిగాడట: "సార్, మీరు యిటీవల క్రైస్తవులైనట్టు విన్నాను. నేను మిమ్మును ఒక ప్రశ్న అడుగవచ్చా?" తప్పక అని చెస్టర్ బదులిచ్చాడట. "పునరుత్థానుడైన క్రీస్తు తటాలున ప్రత్యక్షమై ఈ క్షణంలో మీ వెనుక నిలిచియున్నాడనుకో, మీరు ఏమి చేస్తారు?" అని అడిగాడట. అందుకు చెస్టర్‌టన్ "ఆయన ఉన్నాడు" అని బదులిచ్చాడట.

పరిశుద్ధాత్మ మనతో ఉన్నాడు గనుక యేసు ఈ రోజు మనతో ఉన్నాడు. మనం ఒంటరిగా విడువబడలేదు; మనం ఆత్మ యాచకులం కాదు. మనకు, శిష్యులకువలె,

ప్రపంచమంతా బాధించినా, ఇది ఒక గొప్ప అనుకూలతను కలిగిస్తుంది.

## లోబడవలసిన ఒక ఆజ్ఞ
## (14:15, 20, 21, 23, 24, 31)

ప్రభువైన యేసు తన శిష్యులను ఆదరించి యిచ్చిన మరొక మూలము: ఆజ్ఞల పరంపర. ఆజ్ఞలు ఆదరణగా ఉంటాయని మనం భావించకపోయినా, మన వద్దనుండి దేవుడు ఏమి ఎదురు చూస్తున్నాడో ఆ గ్రహింపును అవి మనకు ప్రసాదిస్తాయి. ఎరుగుట అనేది ధైర్యాన్ని యిస్తుంది.

14వ అధ్యాయంలో, మాటిమాటికి తన ఆజ్ఞలను అనుసరించి లేక గైకొని లోబడి ఉండాలని ప్రభువు పిలుపునిచ్చాడు. అలాటి భాష ప్రేమకు వ్యతిరేకమైనదని కొందరు భావిస్తారు. ఏదియెలాగున్నా, ప్రభువు మాత్రం, విధేయత, ప్రేమ అనేవాటిని ఎన్నడును వేరుగా చూడలేదు. దానికి బదులు ఆయన యిలా అన్నాడు: "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించువాడు; నన్ను ప్రేమించువాడు నా తండ్రివలన ప్రేమింపబడును ..." (14:21). దేవునిపట్లనున్న ప్రేమ విధేయతవలన వ్యక్తపరచబడును.

ప్రభువైన యేసుకైతే, లోబడడమనేది సిలువపై మరణించడమే (14:31). 13నుండి 19 అధ్యాయాలవరకు కొనసాగింపబడిన శోధన సంబంధమైన దీర్ఘముగానున్న ఆ రాత్రియందు యేసు బంధింపబడ్డాడు. మరు దినాన లోక పాపముల నిమిత్తము ఆయన సిలువకు మేకులతో కొట్టబడ్డారు. దానిని జరిగించడంవలన, తన మాటచేతను గాక, తన మాదిరిచేతనే తన శిష్యులకు ఆయన విధేయత యొక్క ప్రాముఖ్యతను కూడా బోధించాడు. దేవునికి మన ప్రేమను కనపరచే మార్గం విధేయతయే.

## ముగింపు

ఆయన తన చర్చను కొనసాగించుతూ, "శాంతి మీ కనుగ్రహించివెళ్లుచున్నాను, నా శాంతినే మీ కనుగ్రహించుచున్నాను; లోకమిచ్చునట్టుగా నేను మీ కనుగ్రహించుట లేదు; మీ హృదయమును కలవరపడనియ్యకుడి వెరవనియ్యకుడి" అని ప్రభువు అన్నాడు (14:27). "మీ హృదయమును కలవరపడనియ్యకు"డనే పిలుపుతో ఈ అధ్యాయం ఆరంభమై, సమాధానమనే వాగ్దానంతో అది ముగించబడుతుంది. సమాధానమనేది మనకందరికి కావలసిందేగాని, దాన్ని నిర్వచించడం తరచుగా కష్టమైయుంటుంది. సమాధానం అనేదాన్ని తరచుగా వ్యతిరేక పదాలతో వర్ణిస్తాం: సమాధానమంటే, యుద్ధం లేకపోవడం, బాధ, వేదన, నష్టం లేకపోవడం. అయితే ప్రభువు శాంతిని నిశ్చయమైన మాటలతో వర్ణించాడు: అది దేవుని సన్నిధి. సమాధానం లేక శాంతిని నీవు ఏ విధంగా ఆలోచిస్తావ్?

క్రీస్తు ప్రభువు అనుగ్రహించిన శాంతి దొంగచేత అపహరింపబడదు, హంతకునిచే చంపబడదు, లేక విపత్కరమైన వర్తమానంతో అర్ధరాత్రి వేళ దూరవాణి పిలుపుతో

ఛిన్నాభిన్నం చేయబడదు. క్రీస్తు యొక్క శాంతి దేవుని ప్రసన్నతయై ఉంది. ఆయన శాంతి సామెతలు 31:25లో వర్ణింపబడియున్న "యోగ్యురాలివలె" నిలుపుతుంది: "బలమును ఘనతయు ఆమెకు వస్త్రములు. ఆమె రాబోవు కాలము విషయమై నిర్భయముగా ఉండును." అనిశ్చయమైన భవిష్యత్తులో, దేవుడు మనతోనున్నాడని ఎరిగి, సంతోషంగా ఉండవచ్చు.

తన శిష్యులకు ప్రభువైన యేసు ఈ ఆదరణ పూర్వకమైన మాటలను వినిపించే టప్పుడు, వారు ఆయన మరణము యొక్క ఆవేదనను, అవ్యక్త స్థితిని ఎదుర్కోబోతున్నారు. నేడు, మనం ఏమి ఎదుర్కోబోతున్నామో మనకు తెలియదు. కదా? జీవితపు అనిశ్చయమైన మార్గాల్లో నడువబోతున్నాం. మన "విశ్వాసపు యాత్రలో" సరిగా నడుద్దాం. అలా చేయడం ద్వారా మనమును మన "భవిష్యత్ విషయాలను గూర్చి చిరునవ్వు నవ్వవచ్చు" – ఏది ఎదుర్కోవలసి వచ్చినా ఆయన తన తొలి శిష్యులను ఎలా సిద్ధపరచాడో మనలను కూడా అలా సిద్ధపరచుతున్నట్టు ఎరిగి యిది చేద్దాం.

---

సూచనలు

[1]Max Lucado, *Tell Me the Secrets* (Wheaton, Ill.: Crossway Books, 1993), 28-30. [2]13:33, 36; 14:2లను చూడు. [3]"సహాయకుడు" అనేది "ఆలోచన కర్త" (NIV), "ఆదరణ కర్త" (KJV), లేక "ఉత్తరవాది" (NRSV) అని కూడా తర్జుమా చేయవచ్చు.